క్లుప్తంగా

'కార్గో' ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి ఎఫెక్ట్..

పరకాల : ఆరు నెలలుగా పరకాల బస్టాండ్‌లో మూసి ఉన్న ఆర్టీసీ కార్గో పార్సిల్ కేంద్రానికి దరకాస్తులను స్వీకరించనున్నట్లు పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న 'నిలిచిన కార్గో సేవలు' శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. అసక్తి కలిగిన వారు ఈనెల 12వ తేదీలోపు దరకాస్తులు అందించాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని బుడగజంగం కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వర్షాకాలం సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న కాలనీ వాసులకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారందరికీ మలేరియా, డెంగీ, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కళా, రాజు, ఆశ వర్కర్లు జ్యోతి, గంగజమున, రజిని పాల్గొన్నారు.

నాగయ్యపల్లిలో..

ఆత్మకూరు : మండలంలోని నాగయ్యపల్లిలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ఫీవర్ సర్వే చేపట్టి పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డాక్టర్ నర్సింగరావు, సీహెచ్‌ఓ జువేది, సిబ్బంది సంపత్, అనీల్‌కుమార్, సరిత, పంచాయతీ కార్యదర్శి సునీల్, ఆశ కార్యకర్తలు యశోద, మరియా, సంధ్య, వసంత, మాధవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నడికూడ / ఆత్మకూరు / పరకాల / దామెర : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలను నడికూడ మండల కేంద్రంలో, దామెర మండల కేంద్రం, ఆత్మకూరులో ఆ పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పరకాల పట్టణంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరకాల బస్టాండ్ కూడలిలో కేక్ కట్‌చేశారు. సివిల్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ విజయపాల్ రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ సారంగపాణి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ లింగమూర్తి, శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సమన్విత్



కమలాపూర్ : ఈనెల 5 నుంచి 7 వరకు నిర్మల్ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్ షిప్ పోటీల్లో ఫార్వర్డ్ బెండ్ విభాగంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న నక్క సమన్విత్ అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించడంతో పాటు త్వరలో విజయవాడలో జరగనున్న జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత తెలిపారు. ఈ సందర్భంగా సమన్విత్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ రాజు, ఉపాధ్యాయ బృందం సోమవారం అభినందించింది.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట హైస్కూల్‌లో 2000 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బాధిత పూర్వ విద్యార్థుల కుటుంబాలను సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అక్కంపేటలో పూర్వ విద్యార్థి బొడ్డు శ్రీనివాస్ కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుంబాన్ని, చౌళ్లపల్లిలో పూజారి తిరుమలేష్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వేణు, రాజు, మల్లేష్, కృష్ణప్రసాద్, అశోక్, రామకృష్ణ, నర్సిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

మాలలకు అన్యాయం చేయొద్దు

పరకాల : ఎస్సీ వర్గీకరణలో భాగంగా గ్రూప్-3లో ఉన్న 26 కులాల మాలలకు అన్యాయం చేసే విధంగా ఉన్న జీఓ 99పై ఎమ్మెల్యేలు పునరాలోచన చేయాలని జాతీయ మాల మహానాడు అధికార ప్రతినిధి నీరటి రాములు కోరారు. ఎమ్మెల్యే, మార్కెట్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడికి వినతిపత్రం అందించారు.

'ఎస్సీ సబ్‌ప్లాన్'తో అభివృద్ధి



వేలేరు ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డుకు క్యూరింగ్ కోసం వేసిన గన్నీ సంచులు

- రూ.2.86 కోట్ల నిధులు కేటాయింపు
- శరవేగంగా కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు
- పలువురి హర్షం

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న ఎస్సీ కాలనీల్లోని వీధులు సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తుండడంతో అద్దంలా తయారవుతున్నాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలకు అంతర్గత రోడ్ల సమస్య తీరి రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. గతంలో పలు గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు లేక వీధుల్లో మురుగునీరు, వర్షపునీరు నిలుస్తూ అపరిశుభ్రంగా కనిపించేది. మండలంలోని ప్రతీ ఎస్సీ కాలనీ వీధుల్లో సీసీ రోడ్లు నిర్మాణమే ధ్యేయంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి వేలేరు మండలానికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.2 కోట్ల 86 లక్షలు కేటాయించగా ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులు మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.15 లక్షల పైగానే రానుండగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని చిన్న,చిన్న వీధుల్లో సైతం సీసీ రోడ్లు నిర్మించనున్నారు. అలాగే సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏ గ్రామ పంచాయతీకి ఎన్ని నిధులంటే..

మండలానికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.2 కోట్ల 86 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. మల్లికుదుర్ల గ్రామానికి రూ.24.90 లక్షలు, మద్దెలగూడెం గ్రామానికి రూ.16.60 లక్షలు, గుండ్లసాగర్ గ్రామానికి రూ.14.11 లక్షలు, కమ్మరిపేట గ్రామానికి రూ.12.45 లక్షలు, షోడాషపల్లికి రూ.24.90 లక్షలు, పీచరకు రూ.33.20 లక్షలు, శాలపల్లికి రూ.16.60 లక్షలు, వేలేరుకు రూ.45.65 లక్షలు, గొల్లకిష్టంపల్లికి రూ.12.45 లక్షలు కేటాయించారు.

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి



వేలేరు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి వేలేరుకు రూ.45.65 లక్షలు కేటాయించడంతో కాలనీలోని అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది. దీంతోపాటు గ్రామాల్లోని వీధుల్లో డ్రెయినేజీ ఏర్పాటు చేసే విధంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ చూపాలి.

- మోతె రవీందర్, వేలేరు

రైతులకు సరిపడా యూరియా అందించాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : రైతులకు సరిపడా యూరియా అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో కాంగ్రెస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు సరిపడా యూరియా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నాయకులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు అయిలయ్య, మహేందర్, రాజేశ్వరావు, శ్రీకాంత్, సుమన్‌గౌడ్, రాజయ్య, వెంకటేష్, బక్కి, బాబురావు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ సక్రమంగా జరగాలి

- ఏడీఏ ఆదిరెడ్డి



ఎరువుల కేంద్రాన్ని సందర్శిస్తున్న ఏడీఏ ఆదిరెడ్డి

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని హనుమకొండ ఏడీఏ ఆదిరెడ్డి, ఏఓ రాజేష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో రైతులకు ఇస్తున్న టోకెన్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎరువుల పంపిణీ సక్రమంగా జరగాలని సూచించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైనంత యూరియా తెప్పిస్తామని హామీ ఇచ్చారు. వరిలో రెండోదఫాగా వేసేందుకు గుళికల యూరియా బదులుగా నానో యూరియా వినియోగించాలని రైతులకు సూచించారు. నానో యూరియాతో మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి



మాట్లాడుతున్న రమాదేవి

ఐనవోలు : అసెంబ్లీ ఎన్నికల ముందు మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా సహాయ కార్యదర్శి రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కొంకాల కవిత అధ్యక్షతన ఐద్వా సమావేశం జరిగింది. ఆమె హాజరై మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన హక్కులు ఉన్నప్పటికీ మహిళలకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా మహిళల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500 ఇవ్వడంతో పాటు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఐద్వా మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కొంకాల కవిత, కార్యదర్శిగా హసీన, కోశాధికారిగా కొయ్యాడ కల్పన, ఉపాధ్యక్షులుగా రాధిక, దర్శనాల సుమలత, సహాయ కార్యదర్శులుగా రమ, కల్యాణి, కమిటీ సభ్యులుగా విజయ, మల్లికాంబ, మానసను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు తార, నాయకురాలు పోచమ్మ, సరోజన, సంధ్య, సుశీల, కోమల పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి కళా ఉత్సవం



మాట్లాడుతున్న ఎంఈఓ రామ్‌ధన్

ధర్మసాగర్ : మండలంలోని వివిధ పాఠశాలల్లో గల విద్యార్థులకు మండలస్థాయి కళా ఉత్సవాన్ని మంగళవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని టీచింగ్ లెర్నింగ్ సెంటర్ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ రామ్‌ధన్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్, ప్రభుత్వ రెసిడెన్షియల్, కేజీబీవీ, ప్రైవేటు పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 9వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులు ఈ కళా ఉత్సవంలో పాల్గొనేందుకు అర్హులని వెల్లడించారు. మ్యూజిక్ సోలో గ్రూప్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలో గ్రూప్, నృత్యం సోలో గ్రూప్, విజువల్ ఆర్ట్స్ సోలో గ్రూప్, కథలు చెప్పడం సంప్రదాయక కథలు చెప్పడం వంటి అంశాలపై పోటీ నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అలాగే ధర్మసాగర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చదరంగం పోటీలను సెమినార్ హాల్లో నిర్వహించనున్నట్లు చెస్ పోటీల నిర్వహణ బాధ్యుడు అయిత శ్రీనివాస్ తెలిపారు.

వృత్తి నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు



సర్టిఫికెట్లతో మహిళలు, శిక్షకులు

ఎల్కతుర్తి : మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణ తీసుకోవడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు ప్రజా గ్రంథాలయంలో వృత్తి నైపుణ్యంలో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో మహిళలకు 30రోజుల బ్యూటీషన్ కోర్సు, జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. వృత్తి నైపుణ్య శిక్షణను వినియోగించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేందుకు ఇలాంటి శిక్షణ ఎంతో దోహపడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యూటీషియన్ ట్రైనింగ్ డైరెక్టర్ నరేష్, శిక్షకులు అనూష, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు వల్లపురెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు రూ.14 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కాగా నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యకమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాజయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు పుట్ట కుమార్, వెంకటయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాపురెడ్డి, రాజు, వెంకటనారాయణ, కృష్ణ, నాయకులు సందీప్‌రెడ్డి, కరుణాకర్, లింగమూర్తి, సుధాకర్, వీ ర న్న, సుధాకర్, రాముతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయంలో సోమవారం కల్లుగీత కార్మిక సంఘం నూతన మండల కమిటీని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లాల గంగధర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బుర్ర సమ్మయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా వంగ శ్రీనివాస్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా గోపగాని సుమన్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, సలహాదారులుగా సదానందం, రమేశ్‌గౌడ్, సారయ్యను ఎన్నుకున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సఖి లీగల్ సెల్ అడ్వయిజర్ శ్రీదేవి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళలు

దామెర : చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ సెల్ అడ్వయిజర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని ఊరుగొండలో సోమవారం మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు సఖి వన్ స్టాప్ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. గృహహింస, వేధింపులు వంటి సమస్యలు ఎదుర్కొనే బాధిత మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 181 లేదా 08702452112 నంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు. కౌన్సెలింగ్, వైద్య, తాత్కాలిక వసతి, న్యాయ, పోలీస్ సేవలు అందించనున్నట్లు చెప్పారు. మహిళలు ధైర్యంగా సమస్యలను తెలుపాలని సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కేస్ వర్కర్ అనూష, మహిళా సంఘాల సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కులసంఘం భూమిని సంరక్షించాలి

- తహసీల్దార్‌కు గీత కార్మికుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం డైరెక్టర్లు

ఐనవోలు : మండలంలోని నందనం గ్రామంలో గీతకార్మిక సంఘానికి చెందిన భూమిని ఇతరులకు పట్టా చేయొద్దని తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు బుర్ర సుధాకర్ గ్రామ కుల సంఘం నాయకులతో కలిసి సోమవారం వినతిపత్రం అందించారు. నందనం గీత కార్మిక సంఘానికి సర్వే నంబర్ 88,95,96,97,98,99,100,101,102ల్లో సుమారు 40 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమి కుల సంఘాలనికి చెందిన 5 మంది వ్యక్తులకు పట్టా అయినట్లు తెలిపారు. కాగా కుల సంఘం అధ్యక్షుడు బుర్ర సురేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు 9 మంది ఏకమై సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విక్రయించే ప్రయత్నం చేస్తున్నట్లు వినతిపత్రంలో ఆరోపించారు. ఆ భూమిని ఎవరైనా కొనుగోలు చేసినా పట్టా చేయొద్దని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో కుల సంఘం డైరెక్టర్లు స్వామి, వెంకట్, కుమారస్వామి, రమేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలతో రుూన్సీరాణి, అధికారులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో సోమవారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు బి.లక్ష్మారెడ్డి (జీహెచ్‌ఎం-2, జెడ్పీహెచ్‌ఎస్ కన్నూరు), ఎం.స్వర్ణ (ఎస్‌ఏ బయాలజీ, ఎంపీయూపీఎస్ దేశరాజుపల్లి), ఎల్.సంధ్యారాణి (ఎస్‌ఏ ఇంగ్లిష్, జెడ్పీహెచ్‌ఎస్ గూడూరు), బి.సుమ (ఎస్‌ఏ బయాలజీ, జెడ్పీహెచ్‌ఎస్ భీంపల్లి), పి.ప్రభాకర్ (ఎస్‌ఏ గణితం, ఎంపీయూపీఎస్ కానిపర్తి), కె.అన్నమ్మ (ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, ఎంపీపీఎస్ కమలాపూర్), జి.స్వరూపరాణి (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ ఉప్పల్), సీహెచ్.విజయకుమారి (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ వంగపల్లి), ఎ.భవాని (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ మర్రిపల్లిగూడెం), కె.జ్యోతి (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ టాకీస్ ఏరియా కమలాపూర్), బి.సదానందం (ఎస్‌జీటీ, ఎంపీయూపీఎస్ గుండేడు), ఎస్.ధనలక్ష్మి (సీఆర్టీ, కేజీబీవీ కమలాపూర్), పి.కరుణ (సీఆర్పీ, జెడ్పీహెచ్‌ఎస్ శనిగరం)ను ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం రుూన్సీరాణి రవీందర్, ఎంపీడీఓ గుండె బాబు, ఎంఈఓ కె.శ్రీధర్ శాలువాతో సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందించారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓను శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి : జిల్లాస్థాయిలో ఇటీవల ఉత్తమ ఎంఈఓగా అవార్డు అందుకున్న భీమదేవరపల్లి ఎంఈఓ సునీతారాణిని ఉపాధ్యాయులు సోమవారం ముల్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, ఉపాధ్యాయులు శాలువాతో సంత్కరించి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు రామనుజం, రాధిక, కవిత, సుకన్య పాల్గొన్నారు.

ఎన్‌సీడీ ఆన్‌లైన్ విధానాన్ని తొలగించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

శాయంపేట : ఎన్‌సీడీ ఆన్‌లైన్ విధానాన్ని తొలగించాలని మండలంలోని ఏఎన్‌ఎంలు సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మండల వైద్యాధికారి సాయికృష్ణకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాలు వినోద మాట్లాడుతూ.. ఏఎన్ ఎంలకు పనిభారం తగ్గించాలని, ఎన్‌సీడీ ఆన్‌లైన్ కోసం డీసీఓలను నియమించాలని కోరారు. ఏఎన్‌సీల టార్గెట్‌ను తీసివేయాలన్నారు. కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు హేమలత, శోభా, సాంబలక్ష్మి, రజిని, సునీత, నిర్మల, మమత, శ్రావణి, స్వరూపతో పాటు తదితరులు పాల్గొన్నారు.


ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తాం



దామెర : సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

దామెర / నడికూడ : ఓటరు జాబితా ముసాయిదాపై అభ్యంతరాలు స్వీకరిస్తామని దామెర ఎంపీడీఓ గుమ్మడి కల్పన, నడికూడ ఎంపీడీఓ విమల అన్నారు. మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం అన్ని పార్టీల మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాల అందజేత



కమలాపూర్ : ఉప్పల్‌కు చెందిన జక్కుల నవీన్ తాను చదువుకున్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సోమవారం రెండు బీరువాలు బహూకరించాడు. 2014-15 బ్యాచ్‌కు చెందిన నవీన్ ఇటీవల తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరారు. తాను చిన్ననాట చదువుకున్న పాఠశాలకు తనవంతు సహకారంగా తన నానమ్మ తాతయ్య జక్కుల ఐలయ్య-సుశీల జ్ఞాపకార్థం రెండు బీరువాలు అందించారు. అదే విధంగా ఎర్రబెల్లి సబితా ఒక బీరువా, మిల్కూరి కావ్య పాఠశాల అభివృద్ధి కోసం రూ.5 వేలు అందించారు. జక్కుల కొమురయ్య, రాజు, రాజు, వినయ్, పవన్‌కల్యాణ్, రాణాప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో డిక్షనరీలు అందించారు. లయన్స్ క్లబ్ ఫస్ట్ రీజన్ చైర్మన్ జన్నపురెడ్డి రాజిరెడ్డి మనుమరాలు సాన్వి పుట్టినరోజు సందర్భంగా రూ.8 వేల విలువచేసే 100 డిక్షనరీలు అందించినట్లు హెచ్‌ఎం మంద సదానందం తెలిపారు. ఈ మేరకు రాజిరెడ్డికి హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ సెక్రటరీ గారే నర్సయ్య, కోశాధికారి ప్రభాకర్, మాజీ అధ్యక్షుడు అనిల్ కుమార్, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, తిరుపతి, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్, అడ్వైజర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.